క్లుప్తంగా

‘షీటీమ్స్’కు ఫిర్యాదు చేయాలా

గచ్చిబౌలి: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మహిళలు, యువతులను వెంబడిస్తే, ఏదైనా ఇతర రకాలుగా వేధిస్తే ఈ నంబర్లకు వాట్సాప్ లేదా నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. సైబరాబాద్ షీ టీమ్స్ సందేశాలు పంపాల్సిన నెంబర్– 9490617444

- బాలానగర్– 9490617 349
- ఐటీకారిడార్– 9490617352
- మాదాపూర్–8333993519
- కూకట్‌పల్లి– 9493626811
- జగద్గిర్‌గుట్ట– 9493624561
- మియాపూర్– 9491051421
- పేట్ బషీరాబాద్– 7901114137
- శంషాబాద్– 9490617354
- డయల్– 100 కూడా చేయవచ్చు.

గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓగా జేమ్స్ బాబు



గచ్చిబౌలి: గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా జేమ్స్ బాబును నియమిస్తూ సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలు జారీ చేశారు. మేడ్చల్ జోన్ ఎస్ఓటీలో సీఐగా పని చేస్తున్న 2007 బ్యాచ్‌కు చెందిన బి.జేమ్స్ బాబు గచ్చిబౌలి పీఎస్‌కు బదిలీ అయ్యారు. గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన గోనె సురేష్‌ను మేడ్చల్ జోన్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



రాయదుర్గం: రాయదుర్గం ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నీలం నరేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను కించపరిస్తే సహించేది లేదని కులమతాలకు అతీతంగా పనిచేయాలన్నారు. కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ముగిసిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ కోర్సులలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలు ముగిశాయి. శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు దేశవ్యాప్తంగా ఈ ప్రవేశ పరీక్షలను నిర్వహించారు. హెచ్‌సీయూలోని 308 పీహెచ్‌డీ సీట్ల కోసం 5,830 మంది ప్రవేశ పరీక్ష రాశారు.హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, అధికారుల పర్యవేక్షణలో ఈ ప్రవేశ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించినందుకు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ అధికారులు, ఉద్యోగులు, ఫ్యాకల్టీ ప్రతినిధులను అభినందించారు.

పాపిరెడ్డి కాలనీలో మెగా ఉచిత వైద్య శిబిరం



వివరాలు తెలుసుకుంటున్న రఘునాథ్ యాదవ్

హఫీజ్‌పేట్: చందానగర్‌లోని పాపిరెడ్డి కాలనీలో రఘునాథ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గౌతమ్ న్యూరో కేర్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరానికి రఘునాథ్ యాదవ్ హాజరై పర్యవేక్షించారు. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామని రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

భవనాన్ని అప్పగిస్తే అందరికీ వైద్యసేవలు!

- వార్డు కార్యాలయం రాయదుర్గం నుంచి గౌలిదొడ్డికి తరలింపు
- సరైన భవనం లేక అందుబాటులోకి రాని వైద్యసేవలు
- ఖాళీ అయిన భవనాన్ని యూపీహెచ్‌ఎస్‌కు పూర్తిగా అప్పగించాలనే డిమాండ్



రాయదుర్గం: రాయదుర్గంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వార్డు కార్యాలయ భవనం పూర్తిగా అప్పగిస్తే పేద, మధ్య తరగతి వారికి ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం రాయదుర్గంలోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయ భవనంలో గచ్చిబౌలి డివిజన్ స్థాయి సమావేశాలు పదేళ్లుగా కొనసాగేవి. కానీ తాజాగా ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ పరిపాలనా వికేంద్రీకరించేందుకు నిర్ణయించి వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాయదుర్గంలోని వార్డు కార్యాలయాన్ని గౌలిదొడ్డిలోని కమ్యూనిటీహాల్‌కు తరలించి అక్కడ ఏర్పాటు చేయడంతో ఈ భవనంపై భాగం పూర్తిగా ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో ఈ భవనాన్ని పూర్తిగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు అప్పగిస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

30 పడకల ఆస్పత్రి నిర్మించాలే డిమాండ్..

ప్రస్తుతం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఔట్ పేషెంట్లకే వైద్య సేవలు అందిస్తున్నారు. భవనం అప్పగిస్తే ఇన్ పేషెంట్లకు కూడా అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఒక డాక్టర్, వైద్య సిబ్బంది మాత్రమే ఉంటున్నారు. ఇక భవనం అందుబాటులోకి వస్తే మరింత మంది కూడా వచ్చే అవకాశం లేకపోలేదు. బెడ్స్ కూడా అందుబాటులోకి వస్తాయి. దీన్ని 30 బెడ్ ఆస్పత్రిగా మార్చాలని స్థానికులు డిమాండ్ కూడా చేస్తుండడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత వాసుల కోరగా ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసిన గతంలో మాదిరిగా సబ్ సెంటర్ తరహాలో కాకపోతే డాక్టర్ అందుబాటులో ఉంటున్నారు. ప్రస్తుతం వార్డు కార్యాలయం ఖాళీ కావడంతో జీహెచ్‌ఎంసీకి సంబంధించిన గోడౌన్‌గానే వాడుకునే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అలా కాకుండా ఆస్పత్రికి కేటాయిస్తే మాత్రం అందరికీ అందుబాటులో పూర్తిస్థాయి ఆరోగ్య కేంద్రం వైద్య సేవలందించేలా మారడం ఖాయమనే అభిప్రాయం అందరిలోనూ కలుగుతోంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టి అందుకు ప్రజాప్రతినిధులు కూడా తమ వంతు కృషిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామ పంచాయతీ నుంచీ ఈ భవనం..

గ్రామ పంచాయతీగా రాయదుర్గం కొనసాగిసన సమయంలో గ్రామ పంచాయతీ భవనంగా దీన్ని నిర్మాణం చేశారు. ఆ తర్వాత జీహెచ్‌ఎంసీ పరిధిలోకి రాగా దీన్ని డివిజన్ స్థాయి కార్పొరేటర్ కార్యాలయంగా, వార్డు సమావేశాలకు నిలయంగా మారింది. అనంతరం పై అంతస్తు నిర్మాణం కూడా చేయడంతో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆస్పత్రికి మూడు గదులను కేటాయించడం అందులోనే కొనసాగిస్తున్నారు. పై అంతస్తులో వార్డు సమావేశాలు, ఇతర జీహెచ్‌ఎంసీ సమావేశాలు కూడా నిర్వహించేందుకు వినియోగించారు. ప్రస్తుతం వార్డు కార్యాలయాన్ని గౌలిదొడ్డికి మార్చడంతో ఈ భవనం ఖాళీ అయింది. వృథాగా ఉంచే బదులు ఆస్పత్రికి కేటాయించాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది. ప్రస్తుతం కొత్తగా స్థలం కేటాయించడం, భవనం నిర్మాణం చేయడం కన్నా ఈ భవనం పూర్తిగా కేటాయించడమే ఉత్తమం అని దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆపన్న హస్తంలా సీఎంఆర్‌ఎఫ్



ఎల్ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపన్న హస్తంగా మారిందని ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని శేరిలింగంపల్లి డివిజన్ లింగంపల్లికి చెంది న రాజుకు రూ.2.50 లక్షలు, మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్‌కు చెందిన రామారావుకు రూ.లక్ష ఎల్ఓసీ పత్రాలను ఆదివారం ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు నాయకులు పోతుల రాజేందర్, సద్దాం, శ్రావణిరెడ్డి, విమల, రేణుక, స్వప్న పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గోపన్‌పల్లి తండాలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన తండాలో పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పర్చాలని, సీసీరోడ్లు, మంచినీటి సమస్య, విద్యుత్ సమస్యలను తీర్చాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. స్థానికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్, సీసీరోడ్లు, మంచినీళ్ల, ఇతర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు వేగంగా చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా డ్రైనేజీ పైప్‌లైన్ డయా పెంచి లెవల్స్‌తో అనుసంధానం చేస్తూ ఒక కాలనీ నుంచి మరొక కాలనీకి మధ్యన ఇబ్బందులు తలెత్తకుండా తగిన ప్రణాళిక రూపొందించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఈ సందర్భంగా కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హన్మంతునాయక్, శేఖర్, ప్రకాశ్, వేణు, రంగస్వామి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

గూగుల్ సమాచారంతో విద్యాబోధన తగదు

ప్రముఖ గణిత విద్యావేత్త, పద్మశ్రీ ఆనంద్‌కుమార్



మాట్లాడుతున్న పద్మశ్రీ ఆనంద్‌కుమార్

రాయదుర్గం: గూగుల్‌లో సెర్చ్‌చేసి పొందే సమాచారంతో విద్యాబోధన చేయడం తగదని ప్రముఖ గణిత విద్యావేత్త, పద్మశ్రీ ఆనంద్‌కుమార్ అన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో శనివారం రాత్రి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని హోటల్ కోహినూర్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నిజమైన, నిక్కచ్చి విద్యను అందించాలన్నారు. విద్యావిధానంలో మాఫియాలు పుట్టుకొచ్చాయని, దీంతో తన సూపర్–30 ప్రోగ్రాం నడిపించడం క్లిష్టంగా మారిందన్నారు. తనను హత్య చేస్తామనే బెదిరింపులు వచ్చాయని, తమ బోధనేతర సిబ్బందిని కత్తితో పొడిచారని, కోచింగ్ సెంటర్లకు ఫీజులు చెల్లించలేని ఐఐటీల కోసం నిరుపేద పిల్లలకు శిక్షణ ఇవ్వడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సూపర్–30 సక్సెస్ అయిందన్నారు. ఈ సూపర్–30లో ఎక్కువ సంఖ్య అమ్మాయిలే ఉండేలా చూడాలన్నది తన సంకల్పమన్నారు. ఎఫ్ఎల్ఓ చైర్ పర్సన్ రీతూషా మాట్లాడుతూ.. ప్రపంచంలో దేనినైనా మార్చగల శక్తివంతమైన ఆయుధం విద్య మాత్రమే అన్నారు.

ఒత్తిడి, భావోద్వేగాలను అదుపులో పెట్టాలి



అవార్డును అందజేస్తున్న డాక్టర్ పి.మధురిమ రెడ్డి

గచ్చిబౌలి: ఒత్తిడి, భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటేనే ఆయా రంగాల్లో రాణిస్తారని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ పి.మధురిమ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాడిసన్ హోటల్‌లో లా ఇన్‌స్పైర్ ఆధ్వర్యంలో ‘ఎనీ బడీ క్యాన్ విన్’ అనే అంశంపై రెండ్రోజుల జాతీయ వర్క్‌షాపు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎమోషనల్ మేనేజ్‌మెంట్ ఆరోగ్యంలో ప్రభావం చూపుతుందన్నారు. ఒత్తిడి కారణంగా నిద్రలేమితో బాధపడేవారు మాత్రలు వేసుకుంటున్నారని తెలిపారు. నేను రాసిన ఎమోషనల్ మ్యాస్ట్రీ సెకండ్ బుక్ త్వరలో వస్తుందన్నారు. సమాజంలో మార్పుల కోసం కృషి చేసిన మాజీ ఎక్సైజ్ ఆఫీసర్ బద్రినాథ్, ఫారెస్ట్ ఆఫీసర్ శోభకు చేంజ్ మేకర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందజేశారు.

టీ-9 గోల్ఫ్ ఛాలెంజ్ లో రైడర్స్ శుభారంభం



సాక్షి, సిటీబ్యూరో: యువ గోల్ఫర్లను ప్రోత్సహించేందుకు టీ గోల్ఫ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న టీ–9 ఛాలెంజ్ గోల్ఫ్ టోర్నీ రెండో సీజన్ ప్రారంభమైంది. తొలిరోజు బీహెచ్‌జీసీసీ రైడర్స్ టీమ్ శుభారంభం చేసింది. ఆరంభ మ్యాచ్‌లో రైడర్స్ 3–1 స్కోర్‌తో బౌల్డర్ నింజాస్‌పై విజయం సాధించింది. రైడర్స్ టీమ్‌లో దేశాంత్ కైలా, ఆంద్రూ వుడ్, డి.తరుణ్, వేణు పాలినేని చక్కని ఆటతీరు కనబరిచారు. కాగా డిఫెండింగ్ ఛాంపియన్స్ బౌల్డర్ హిల్స్ టైగర్స్ , నోవాటెల్ స్టార్స్‌తో మ్యాచ్‌ను 2–2తో డ్రాగా ముగించింది. టైగర్స్ టీమ్ ప్లేయర్ అలిన్ యామిన్ మరోసారి అద్భుత ఆటతీరుతో ఓటమిని తప్పించారు. మిగిలిన మ్యాచ్‌లలో సిమెట్రిక్స్ ఎకోలాస్టిక్ ఈగల్స్‌పైనా, జాగృతి జాగర్స్ టీజీఎఫ్ బ్యాక్ స్పిన్నర్స్‌పైనా విజయం సాధించాయి.

‘డబుల్’ ఇళ్లను కేటాయించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో మున్సిపాలిటీ పరిధిలో నివసించే పేదలకు 50శాతం కేటాయించాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లూర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద స్థానిక కౌన్సిలర్ మయూరి రాజుగౌడ్‌తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్ గేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లాపూర్, కొల్లూర్‌లకు సంబంధించిన విలువైన భూములను ప్రభుత్వం తీసుకుందన్నారు. కానీ.. ఇక్కడి నిరుపేదలకు ఇళ్లను కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కౌన్సిలర్లు పావని, సరిత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు రాజుగౌడ్, శ్యాంరావు, తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలతో ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న బండిరమేష్

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్‌లోని అంజయ్యనగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయన దృష్టికి పలు అంశాలను తీసుకురాగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలు ఉన్నా అందరూ సమష్టిగా సమావేశమై వాటిని పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజు ముదిరాజ్, రవిశంకర్, లక్ష్మణ్‌నాయక్, వీరశెట్టి, శంకర్, తారానాయక్, సంగారెడ్డి, నర్సింగరావు, అంజద్ మునాఫ్‌ఖాన్ పాల్గొన్నారు.



డ్రగ్స్‌కు బానిస కావొద్దు

డ్రగ్స్ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొత్తగూడలోని శరత్‌సిటీ క్యాపిటల్ మాల్‌లో యువత ఫ్లాష్ మాబ్‌తో హోరెత్తించింది. ఆదివారం మాదకద్రవ్యాల వ్యతిరేఖ అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు నృత్యాలు చేస్తూ నినాదాలు చేశారు. యువత డ్రగ్స్‌కు బానిస కావద్దని పిలుపునిచ్చారు. –గచ్చిబౌలి

నృత్యం.. అలరించెన్



మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సృజన జాతీయ నృత్యోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా దేబశ్రీ పట్నాయక్ ఒడిసి నృత్యం, డాక్టర్ రవికుమార్ బృందం లంబాడా నృత్యం, తెక్రం వర్మబృందం పంథి డాన్స్, సుష్మబృందం గొల్లకలాపం, మైథిలి అనూప్ మోహినియట్టం, శ్రీనివాస్ బృందం భాంగ్రా, ఆర్పా మిశ్ర కథక్ నృత్యప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. –మాదాపూర్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



కరపత్రాలను అందజేస్తున్న బీజేపీ నాయకులు

మాదాపూర్: మాదాపూర్‌లోని ఇజ్జత్‌నగర్‌వీకర్ సెక్షన్ కాలనీలో ఆదివారం రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో గడప గడపకూ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 9 ఏళ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేలా కృషి చేస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహయాదవ్, రాధాకృష్ణ యాదవ్, శ్రీనివాసరెడ్డి, సత్యం, కృష్ణగౌడ్, శివ, యాదయ్య, కుర్మయ్య, బాలునాయక్, మధనాచారి, భారతి, చంద్రకళ, స్వప్న, విష్ణు, నరేష్, గోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

బీఆర్టీయూను బలపర్చండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి

పటాన్‌చెరు టౌన్: పాశమైలారం పారిశ్రామికవాడలోని కిర్బీ పరిశ్రమలో త్వరలో జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్టీయూ, బీఎంఎస్, టీఎన్‌టీయూసీ ఐక్య కూటమి తరపున పోటీచేస్తున్న కార్మిక శాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో కిర్బీ పరిశ్రమ బీఆర్టీయూ, బీఎంఎస్, టీఎన్‌టీయూసీ కార్మిక సంఘాల ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. త్వరలో జరగనున్న కిర్బీ పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్, టీఎన్ టీయూసీ, బీఎంఎస్ కూటమిగా ఏర్పడి పోటీ చేయనున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే బీఆర్టీయూ, ఈసారి కిర్బీ పరిశ్రమ కార్మికుల సంక్షేమం కోసం కూటమిగా పోటీ చేస్తోందన్నారు. ప్రస్తుత అధికార యూనియన్ సీఐటీయూ పరిశ్రమ యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. పరిశ్రమ లాభాల్లో కొనసాగుతున్నప్పటికీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ వారికి ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పారిశ్రామిక రంగంలో అమలు చేస్తున్న విప్లవాత్మక సంస్కరణలతో అంతర్జాతీయ పరిశ్రమలు తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. దీంతో లక్షలాది ఉద్యోగాలు లభిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు



కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన కృష్ణారాజ్‌పుత్, సీనియర్ నాయకుడు తూము వేణు ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సుజ్జు బాయ్, మైసయ్య ముదిరాజ్, నర్సింహాచారి, అక్బర్, బాలరాజు, డీఆర్ కృష్ణ, శంకర్, శివగౌడ్, రాయపాటి హరీష్ తదితరులు పాల్గొన్నారు.



అవకాశాలు లభిస్తే మహిళలు ప్రతీ రంగంలోనూ రాణిస్తారని వక్తలు స్పష్టం చేశారు. నగరానికి చెందిన యోషిత గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం కొండాపూర్‌లో మహిళా శక్తి సమ్మేళనం నిర్వహించారు. రియల్ ఉమెన్స్ మీట్ పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నగర మహిళలు పాల్గొని తాము ఎన్నుకున్న రంగాల్లో ఎదుర్కున్న ఆటుపోట్లు, వాటిని అధిగమించిన తీరుతెన్నుల గురించి వివరించారు. –సాక్షి, సిటీబ్యూరో

ముగిసిన గ్లోబల్ ఆయుష్, వెల్‌నెస్ ఎక్స్‌పో



అవార్డులను అందజేసిన సజ్జనార్

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న గ్లోబల్ ఆయుష్, వెల్‌నెస్ ఎక్స్‌పో ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ ఎండీ.వీసీ సజ్జనార్ పాల్గొని స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్లు, స్కాలర్లకు, సెమినార్‌లో పాల్గొని స్పీకర్‌గా వచ్చిన ప్రొఫెసర్‌కు మెమెంటో, సర్టిఫికెట్‌లను అందజేశారు. హెల్త్, వెల్‌నెస్ సంబంధిత వ్యాపారాలపై అవగాహన కల్పించినందుకు సంతోషాన్ని వ్యక్తపరిచారు.